## కౌశలం ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు

**అనకాపల్లి, పెన్ సత్తా, ఆగస్టు 25**: అనకాపల్లి జిల్లా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో "కౌశలం" కార్యక్రమం ద్వారా ప్రముఖ సంస్థలో ఉద్యోగ నియామకాలకు జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ వారి తరపున జిల్లా స్వర్ణ గ్రామ--స్వర్ణ వార్డు అధికారి తెలిపారు.

పరవాడకు చెందిన సినెర్జెన్ యాక్టీవ్ ఇంగ్రెడింట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో 100 ప్రొడక్షన్ ట్రైనీ కెమిస్ట్, జూనియర్ కెమిస్ట్, కెమిస్ట్ పోస్టుల భర్తీకి ఈ నెల 27, 28 తేదీలలో ఉదయం 9.00 గంటల నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు అనకాపల్లి గుండాల జంక్షన్ లోని ఎస్.ఆర్. శంకరం మీటింగ్ కాంప్లెక్స్‌లో జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వర్ణ గ్రామ--స్వర్ణ వార్డు పరిధిలో నిర్వహించిన "కౌశలం" ఆన్‌లైన్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన బి.ఎస్సీ (కెమిస్ట్రీ), ఎం.ఎస్సీ (కెమిస్ట్రీ), బి .ఫార్మసీ, ఎం.ఫార్మసీ విద్యార్హతలు కలిగిన నిరుద్యోగ అభ్యర్థులకు ఈ నియామకాల్లో అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఐటిఈడసి శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగ నియామక ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.19,125 నుంచి రూ.37,500 వరకు వేతనం లభించనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు అవసరమైన ధ్రువపత్రాలతో జాబ్ డ్రైవ్‌కు హాజరై ఈ ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ం

## కేజీహెచ్‌లో సమ్మె చేస్తున్న జూనియర్ డాక్టర్లకు ఎస్ఎఫ్ఐ సంఘీభావం



**విశాఖపట్నం, పెన్ సత్తా, ఆగస్ట్ 25:** రాష్ట్ర వ్యాప్తంగా తమ న్యాయ మైన డిమాండ్ల సాధన కోసం గత 16 రోజులుగా సమ్మె చేస్తున్న జూనియర్ డాక్టర్లకు ఎస్ఎఫ్ఐ విశాఖపట్నం జిల్లా కమిటీ సంఘీభావం తెలిపింది.

విశాఖపట్నం లోని కింగ్ జార్జ్ హాస్పిటల్ (కేజీహెచ్)లో సమ్మె చేస్తున్న జూనియర్ డాక్టర్లను ఎస్ఎఫ్ఐ విశాఖపట్నం జిల్లా కార్యదర్శి జి. అజయ్ కలిసి, ఎస్ఎఫ్ఐ విశాఖపట్నం జిల్లా కమిటీ తరపున వారి పోరాటానికి సంఘీభావం తెలిపారు.

జూనియర్ డాక్టర్ల ప్రధాన డిమాండ్లలో స్టైపెండ్ పెంపు, వైద్యులకు సంబంధించిన పోస్టుల్లో ఏంఎస్సీ /పీహెచ్డీ అర్హత కలిగిన అభ్యర్థులను నియమించకూడదని, అలాగే పదవీ విరమణ వయస్సును 65 సంవత్సరాలకు పెంచకూడదని కోరుతున్నారు. ఈ సందర్భంగా జి. అజయ్ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు వైద్య సేవలు అందించడంలో జూనియర్ డాక్టర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. అధిక పని భారం, అనేక బాధ్యతల మధ్య కూడా ప్రజలకు సేవలందిస్తూ తమ న్యాయ మైన సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నారని తెలిపారు.

జూనియర్ డాక్టర్ల డిమాండ్ల పై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వారితో చర్చలు జరిపి, సమస్యలను పరిష్కరించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని జి. అజయ్ డిమాండ్ చేశారు. జూనియర్ డాక్టర్ల ప్రజాస్వామ్య పోరాటానికి ఎస్ఎఫ్ఐ పూర్తి మద్దతుగా నిలుస్తుందని తెలిపారు. ఈ సంఘీభావ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు పి. సాయి తేజ, ఎస్ఎఫ్ఐ నాయకులు దోహిత్, రాహుల్ పాల్గొని సమ్మె చేస్తున్న జూనియర్ డాక్టర్లకు సంఘీభావం తెలిపారు.

## మరిడి మాంబకు పిండి వంటలు సమర్పించిన మహిళలు





**అనకాపల్లి, పెన్ సత్తా, ఆగస్ట్ 25**: పట్టణంలో ఎన్నో సంవత్సరాల చరిత్ర కలిగిన కోట్ని వీధి లో వెలిసిన మరిడి మాంబ అమ్మవారి పండగ మహోత్సవాలలో భాగంగా మంగళవారం ఆలయ చుట్టు పక్కల అన్ని వీధుల్లో మహిళలు వివిధ రకాల పిండివంటలు తయారుచేసి అమ్మవారి వారికి సమర్పించారు. అనంతరం అమ్మవారి సారె ఊరేగింపు ఘనంగా జరిగింది. సారె ఊరేగింపు ఆలయ పాలక మండలి సభ్యులు ప్రారంభించారు. కోట్ని వీధి, మల్ల వీధి, పెద్దవీధి, తాకాశి వీధి, భీముని గుమ్మం, నాయి బ్రాహ్మణ వీధిగా, సరసవారవీధి, కొణతాల వారి వీధి, లక్ష్మీనారాయణ నగర్ లో ఊరేగింపు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కె చందర్ తేజ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ గుర్రాల శ్రీనివాస్, 84 వార్డ్ టిడిపి ఇన్చార్జ్ తలారి లక్ష్మీప్రసాద్, కోట్నిరామకృష్ణ ధర్మకర్తలు

ఆలయ చైర్మన్ గుర్రాల శ్రీనివాస్, ధర్మకర్తలు ఇల్లపు పరమేశ్వర రావు, కోట్ని సాయికుమార్, చెట్టుపల్లి సత్యనారాయణ కుమార్, వడ్డాది వంశీ, ఇందుగబిల్లి కవితా రాణి,

కోట్నిఅయ్యన్న దొర, కోట్ని రాంబాబు, కోరుకొండ అప్పలసూరి, కోట్నిసూరిబాబు, కోట్ని కొండలరావు, సన్యాసి నాయుడు, కరణం శ్రీనివాసరావు, సాయి, హరి,

కోట్ని వీధిపంచాయతీ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# గన్నవరాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం యార్లగడ్డ.






- ప్రతి 3 నెలలకు ఒక సారి అధికారులతో సమీక్ష ఎమ్మెల్యే యార్లగడ్డ.
- 11,200 ప్రజా ఫిర్యాదులు పరిష్కరించిన అధికారులకు నా అభినందనలు యార్లగడ్డ.
- నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.100 కోట్లు కేటాయించిన సీఎంకు కృతజ్ఞతలు.

**గన్నవరం, పెన్ సత్తా, ఆగస్ట్ 25:** నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రతి మూడు నెలలకు ఒక సారి అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నానని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గన్నవరం ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో విద్య, వైద్యం, నీటిపారుదల, పంచాయతీరాజ్, రెవెన్యూ, విద్యుత్, ఆర్అండ్‌బీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ప్రతి మూడు, నాలుగు నెలలకు సమీక్షలు నిర్వహించే వాళ్లమని, అమెరికా పర్యటన, అసెంబ్లీ సమావేశాల కారణంగా ఈసారి ఆలస్యమైందన్నారు. ఇక పై పనులు పెండింగ్ లో పడకుండా క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తానని చెప్పారు. గన్నవరం నియోజకవర్గంలో పనిచేస్తున్న అధికారులు అంకితభావంతో విధులు నిర్వహిస్తున్నారని యార్లగడ్డ అభినందించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో గన్నవరం తహసీల్దార్ శివయ్యతో పాటు పలువురు అధికారులు రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉద్యోగి పురస్కారాలు అందుకోవడం వారి పనితీరుకు నిదర్శనమన్నారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పరిపాలన అభివృద్ధి - సంక్షేమం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పర్యటిస్తున్న సమయంలో అధికారులంతా తనతో కలిసి ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నందుకు ప్రత్యేకంగా అభినందించారు. ప్రజాదర్బార్ ల ద్వారా ఇప్పటివరకు సుమారు 11,200 ఫిర్యాదులను అధికారులు పరిష్కరించారని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన తొలినాళ్లలో ఒకే రోజు వెయ్యికి పైగా దరఖాస్తులు వచ్చేవని, కానీ ఇప్పుడు 200--300కు తగ్గిన పరిస్థితి ఉందన్నారు. ప్రజలు కార్యాలయాలకు వచ్చే పరిస్థితి కాకుండా అధికారులు గ్రామాల్లోనే సమస్యలను గుర్తించాలని యార్లగడ్డ సూచించారు. ముఖ్యంగా పంచాయతీ కార్యదర్శులు ఇతర అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రజల అవసరాలను గుర్తించి తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. గన్నవరం పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కోనాయ చెరువు నుంచి పైప్‌లైన్ ఏర్పాటుకు రూ.5 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయితే గన్నవరం ప్రజల దాహార్తి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. అదేవిధంగా నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కేటాయించిన రూ.100 కోట్ల నిధులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఏటీఆర్ నివేదికలను ఎమ్మెల్యే కార్యాలయం నిరంతరం పర్యవేక్షిస్తుందని చెప్పారు. నియోజకవర్గంలో వీధి దీపాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశించారు. రెండు విద్యుత్ స్తంభాల మధ్య వెలుతురు లేని ప్రాంతాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆర్‌డీఎస్ఎస్ పథకం కింద ప్రస్తుతం ఆరు గ్రామాల్లో పనులు జరుగుతున్నాయని, మిగిలిన పంచాయతీల్లో కూడా వాటిని విస్తరిస్తామని తెలిపారు. దావాజీగూడెం రహదారి విస్తరణ పనులు ఆలస్యమవుతున్నాయని ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులు ప్రత్యేకంగా సమీక్షించి 15 నుంచి 20 రోజుల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులు, ప్రజల అవసరాలే ప్రభుత్వ ప్రాధాన్యమని, సమన్వయంతో పనిచేసి గన్నవరం నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలబెడతామని యార్లగడ్డ వెంకట్రావు స్పష్టం చేశారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, రెవెన్యూ సేవల్లో విశిష్ట పనితీరు కనబర్చి స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రశంసా పత్రం అందుకున్న గన్నవరం తహసీల్దార్ కె.వి. శివయ్యను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు శాలువాతో ఘనంగా సత్కరించారు. ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరిస్తూ అవార్డ్ తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గన్నవరం మండల పార్టీ అధ్యక్షులు గూడపాటి తులసి మోహన్, టిడిపి సీనియర్ నాయకులు దొంతు చిన్నా, కాసర్నేని రంగబాబు, ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్ , బిబి గూడెం పిఏసిఎస్ చైర్మన్ బోయపాటి మురళీకృష్ణ (బుల్లియ్య), అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి జలాలతో ఉత్తరాంధ్రకు కొత్త వెలుగు.







- పోలవరం ఎడమ కాలువ జలహారతి కార్యక్రమానికి సీఎం చంద్రబాబు రాక.
- ఏర్పాట్లను పరిశీలించిన హోం శాఖ మాత్యులు వంగలపూడి అనిత.

**పాయకరావుపేట, పెన్ సత్తా, ఆగస్టు 25**: పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు అందించే చారిత్రాత్మక ఘట్టానికి ప్రభుత్వం సర్వం సిద్ధం చేస్తోంది. పోలవరం ఎడమ కాలువ జలహారతి కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటారని రాష్ట్ర హోంశాఖ మాత్యులు వంగలపూడి అనిత పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్ తో కలిసి రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత పాయకరావుపేట మండలం సీతారాంపురం నుంచి పీఎల్‌పురం, పాయకరావుపేట ప్రాంతాల వరకు పోలవరం ఎడమ కాలువ...

# వెన్నెల రుద్ర చికిత్స కొరకు వైస్సార్సీపీ శ్రేణులు ఆర్థిక సహాయం.

**పరవాడ, పెన్ సత్తా, ఆగస్ట్ 25:** వెన్నెలపాలెం గ్రామం లోని వెన్నెల బాలాజీ కుమారుడు వెన్నెల రుద్ర చికిత్స కొరకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసి గ్రామ వైస్సార్సీపీ శ్రేణులు ఆర్థిక సహాయం అందించారు. మంగళవారం మాజీ సర్పంచ్ వెన్నెల అప్పారావు (ఇంజనీర్), గ్రామ వైస్సార్సీపీ శ్రేణులు బాలాజీ కుటుంబాన్ని పరామర్శించి, రుద్ర బాబు చికిత్స కోసం 1,01,116 రూపాయిలు నగదు బాలాజీ కుటుంబానికి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పయిల సత్యనారాయణ, వెన్నెల సింహాద్రి, పయిల రేగారావు, కథారి నాయుడు, బండారు నాయుడు, మాసవరపు ముత్యాల నాయుడు (ఆర్టీసీ), మాసవరపు దేముడు నాయుడు, పయిల సన్యాసి రావు, దుంగల సోము నాయుడు , శిరపురపు హరి, నాగిరెడ్డి సూర్యనారాయణ, చుక్క దామోదర రావు, మాసవరపు నానాజీ, తదితరులు పాల్గొనడం జరిగింది.



# ఎన్ టి పి సి బూడిది గ్రామాల పై ఎగరడాన్ని నియంత్రంచాలి.



**సిఐటియు నాయకుడు గనిశెట్టి డిమాండ్.**

**పరవాడ, పెన్ సత్తా, ఆగస్ట్ 25:** మండలంలో కలపాక, మూల స్వయంవరం, స్వయంవరం గ్రామాల్లో నిత్యం ఎన్టిపిసి బూడిది చెరువు నుండి బూడిది ఎగిసి పడడంతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సమస్య పరిష్కరించడానికి ఎన్టిపిసి యాజమాన్యం చర్యలు చేపట్టాలని, ప్రజల ఆరోగ్యాలతో చెలగాట మాడుతున్న ఎన్టిపిసి యాజమాన్యం పై చర్యలు చేపట్టాలని సిఐటియు నాయకులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం పరవాడలో స్థానిక విలేకరులతో గనిశెట్టి మాట్లాడుతూ ఎన్టిపిసి యాజమాన్యం కలపాక గ్రామంలో బూడిద ఎగిరి పడుతున్న ప్రజల ఆరోగ్యాలను పట్టించు కోవడంలేదని నియంత్రణకు చర్యలు చేపట్టడం లేదని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని గనిశెట్టి మండి పడ్డారు. హిందూజా బొగ్గు లారీలు కాలుష్యం ఒకవైపు ఎన్టీపీసీ బూడిది కాలుష్యంతో గ్రామం పూర్తిగా కాలుష్యం అయిందని దీన్ని నివారించడానికి జిల్లా అధికారి యంత్రాంగం చర్యలు చేపట్టాలని గనిశెట్టి కోరారు.

